వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, ఎన్నికల విభాగం అధికారి నాగార్జున

పకడ్బందీగా ఓటరు జాబితా

సవరణ చేపట్టాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్రప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి

రంగారెడ్డి, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : ఎస్ఎస్ఆర్-2025లో భాగంగా నిర్వహిస్తున్న ఓటరు జాబితా సవరణ ప్రక్రియను కట్టుదిట్టంగా చేపడుతూ నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి సూచించారు. మంగళవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్పెషల్ సమ్మరీ రివిజన్, ఈఆర్ఓ నెట్ 2.0 తదితర అంశాలపై కలెక్టర్లతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ.. ఓటరు జాబితా సవరణలో భాగంగా కొనసాగుతున్న ఇంటింటి సర్వే ప్రక్రియ వేగవంతమయ్యిందని, వారం రోజుల వ్యవధిలోనే 55 శాతం నుంచి 95 శాతానికి చేరుకుందని.. ఇందుకు కృషి చేసిన జిల్లా కలెక్టర్లు, ఏఈఆర్‌వోలు, బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లను అభినందించారు. మరో ఐదు రోజుల వ్యవధి మాత్రమే మిగిలి ఉన్నందున గడువులోపు ఇంటింటి సర్వేను అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో వంద శాతం పూర్తి చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు తప్పనిసరిగా ప్రతి ఇంటిని, తమ పరిధిలోని ప్రతి పోలింగ్ కేంద్రాన్ని తప్పక సందర్శించాలని, తద్వారా ఓటరు జాబితాలో ఎలాంటి సాంకేతిక తప్పిదాలు చోటుచేసుకునేందుకు అవకాశం ఉండదన్నారు. పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ ప్రక్రియను ఓటరు ముసాయిదా జాబితా వెలువరించడానికి ముందే పూర్తి చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రం కొనసాగుతున్న ప్రదేశాన్ని తెలియజేసేలా ఫొటోలను బీఎల్‌వో యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఓటరు నమోదు, మార్పులు, చేర్పులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫారం 6, ఫారం 6 ఏ, ఫారం 7, ఫారం 8 దరఖాస్తులపై త్వరిత గతిన పరిశీలన జరపాలని సూచించారు. ఈ నెలాఖరు వరకు అన్ని పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. శాశ్వత ప్రాతిపదికన ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన వారి వివరాలు క్షేత్ర స్థాయిలో సేకరించి, ఎన్నికల సంఘం నియమ నిబంధనలకు అనుగుణంగా నోటీసు జారీ చేసిన మీదట అలాంటి వారి పేర్లను జాబితా నుంచి తొలగించాలని సూచించారు. ఇంటింటి సర్వేలో ఆధార్ నెంబర్ సేకరణ తప్పనిసరి కాదని, ఓటర్లు ఇష్టం ఉంటే ఇవ్వవచ్చని, బలవంతం చేయరాదన్నారు. ఇంటింటి సర్వే సంబంధించి వచ్చిన నూతన ఓటర్ నమోదు దరఖాస్తుల వివరాలు, ఎస్ఎస్ఆర్-2025తో ముడిపడిన అంశాలను ఎప్పటికప్పుడు రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియజేయాలన్నారు. వారితో సమావేశాలు నిర్వహించే సందర్భంగా బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకోవాల్సిందిగా నోటీసుల ద్వారా కోరాలని సీఈవో సూచించారు. కొత్త ఓటరు కార్డుల ముద్రణకు సంబంధించిన వివరాలను సకాలంలో సమర్పించాలన్నారు. గతంలో ఓటు హక్కు వినియోగించుకున్న వారు సైతం మరోసారి తప్పనిసరిగా ఓటు హక్కు కోసం పేరు నమోదు చేసుకోవాల్సి ఉంటుందని, ఈ అంశాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని కలెక్టర్లకు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, ఎన్నికల విభాగం అధికారి నాగార్జున, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



మంచి పేరు వచ్చేలా పని చేయండి

వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి

బంట్వారం, సెప్టెంబర్24 : శిక్షణ పూర్తి చేసుకుని నూతనంగా పోలీస్ డిపార్ట్ మెంట్‌లో చేరిన మీరందరు మంచి పేరు తెచ్చేలా పని చేయాలని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఇటీవల టీఎస్‌పీఎల్‌లో శిక్షణ పూర్తి చేసుకుని 17 మంది పోలీస్ అధికారులు జిల్లా కార్యాలయంలో రిపోర్టు చేయగా, వారిని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. శిక్షణా కాలంలో మీరు నేర్చుకున్న విషయాలు మీ సర్వీసులో ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. డిపార్ట్‌మెంట్‌లో అధికారులు చేయాల్సిన పనులు, చేయకూడని పనులు గురించి తప్పక తెలుసుకోవాలన్నారు. సమయపాలన, క్రమశిక్షణ, స్వచ్ఛత తదితర వాటిపై దృష్టి పెట్టాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి సేవలు అందించాల్సింది మనమేనని ఎస్పీ తెలిపారు.

రుణమాఫీ కాలేదని కలెక్టర్‌కు వివరిస్తున్న రైతులు

ఆందోళన వద్దు

అర్హులందరికీ రుణమాఫీ

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

బొంరాస్‌పేట, సెప్టెంబర్ 24 : రుణమాఫీ కాలేదని రైతులు ఆందోళన చెందవద్దని, అర్హులందరికీ రుణమాఫీ అవుతుందని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. మంగళవారం బొంరాస్‌పేట మండలానికి వచ్చిన కలెక్టర్‌కు రైతు వేదిక వద్ద ఎనికేపల్లి గ్రామానికి కొందరు రైతులు తమకు రుణమాఫీ కాలేదని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. రైతుల పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డులను పరిశీలించి అక్కడే ఉన్న కొడంగల్ ఏడీఏ శంకర్‌నాయక్‌ను పిలిచి తెలుసుకున్నారు. ఏఏ బ్యాంకుల్లో ఎంతెంత రుణాలు తీసుకున్నారని రైతులను అడిగారు. చాలా మంది రైతులు తమకు రూ.2 లక్షలపైన ఉన్న రుణాలు మాఫీ కాలేదని కలెక్టర్‌కు తెలిపారు. కుటుంబ నిర్ధారణ, కొన్ని ఇతర సమస్యల వల్ల రైతులకు రుణమాఫీ కాలేదని రైతులకు చెప్పారు. రూ.2 లక్షలపైన ఉన్న రుణాలివికీ మాఫీ కాలేదని, ప్రభుత్వం నిర్ణయించిన తేదీలో రుణమాఫీ అవుతుందని పేర్కొన్నారు. అధికారులు బుధవారం ఎనికేపల్లికి వచ్చి ఎవరెవరికి రుణమాఫీ కాలేదో విచారణ చేస్తారని కలెక్టర్ తెలిపారు.

వైద్య శిబిరాన్ని సందర్శించిన కలెక్టర్

ఆకార్ ఆషా ఫౌండేషన్ హైదరాబాద్‌వారి ఆధ్వర్యంలో మండలంలోని రైతు వేదికలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని కలెక్టర్ సందర్శించారు. బొంరాస్‌పేట మండలంలో బుద్ధిమాంద్యం, శారీరక వైకల్యం తదితర దివ్యాంగ సమస్యలను గుర్తించడానికి నెలరోజులపాటు ఎర్లీ ఇంటర్‌వెన్షన్ డిసేబులిటీ సర్వేను అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు నిర్వహించారు. సర్వేలో 3825 మంది బుద్ధిమాంద్యులను గుర్తించగా వీరిలో 350 మంది రిస్క్‌లో ఉన్నట్లు గుర్తించారు. అదేవిధంగా 38 మంది శారీరక వైకల్యం ఉన్నవారిని గుర్తించారు. వీరికి ఆకార్ సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని కలెక్టర్ సందర్శించి వైద్యాధికారులు, చిన్నపిల్లలు, శారీరక వైకల్యంతో బాధపడేవారితో మాట్లాడారు. అవసరమున్నవారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తారని వైద్యాధికారులు తెలిపారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌వో పల్వన్‌కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌వో రవీంద్రయాదవ్, మండల వైద్యాధికారి హేమంత్‌కుమార్ పాల్గొన్నారు

నీటి సరఫరాపై అవగాహన పెంచుకోవాలి

- రంగారెడ్డి జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి
- వాటర్‌మన్‌ల శిక్షణా తరగతులకు హాజరు

శిక్షణా తరగతుల కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి

షాబాద్, సెప్టెంబర్ 24 : గ్రామాల్లో తాగునీటి సరఫరాపై మంచినీటి సహాయకులు అవగాహన పెంచుకోవాలని రంగారెడ్డి జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం షాబాద్ మండల పరిషత్తు కార్యాలయం సమావేశ మందిరంలో మండలంలోని 41 గ్రామపంచాయతీలకు సంబంధించిన మంచినీటి సహాయకులకు(వాటర్‌మెన్) నిర్వహించిన నాలుగు రోజుల శిక్షణా తరగతుల కార్యక్రమానికి జడ్పీ సీఈవో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఉండే వాటర్‌మెన్ నీటి సరఫరాతో పాటు మరమ్మతులపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. నాలుగు రోజుల పాటు నిర్వహించే శిక్షణా తరగతుల్లో వారికి యంత్రాలు, మోటర్లు, వాటిని ఎలా ఉపయోగించాలి, ఏదైనా సమస్య వస్తే ఎలా పరిష్కరించాలనే తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మోటర్‌కు రిపేర్ వచ్చినప్పుడు ఎవరో వచ్చి చేయాలని వేచి చూడకుండా వాటర్‌మెన్‌లకే శిక్షణ ఇస్తే వారే మరమ్మతులు చేసుకుంటారని స్పష్టం చేశారు. నీటిని పరీక్ష చేయడం, ట్యాంకులను శుభ్రం చేసి, బ్లీచింగ్ పౌడర్ వేయడం వంటి విషయాలపై అర్థమయ్యేలా క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ రాజేశ్వర్‌రావు, డీఈ హరిక, ఎంపీడీవో అపర్ణ, ఏఈఈ చంద్రమోహన్, మిషన్ భగీరథ ఏఈలు ప్రపుల్‌కుమార్, గీతాస్రవంతి, సిబ్బంది పాల్గొన్నారు.

నీటి సరఫరాకు ఇబ్బంది రాకూడదు

నందిగామ : గ్రామాల్లో నీటి సరఫరాలో సమస్యలు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి అన్నారు. నందిగామలో మిషన్ భగీరథ అధికారులు, సిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బందికి ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమానికి సీఈవో ముఖ్య అతిథిగా హాజరై గ్రామాల్లో క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ ద్వారా సురక్షిత మైన మంచినీరు ప్రజలకు అందించాలని, నీటి సరఫరా విషయంలో నిర్లక్ష్యం వహించకూడదని, ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షణ చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఎస్ఈ ఆంజనేయులు, ఈఈ రాజేశ్, డీఈఈ అబ్దుల్, ఏఈలు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాత పాఠశాల భవనాన్ని వెంటనే కూల్చేయాలి

- నమస్తే తెలంగాణ దినపత్రికలో వచ్చిన కథనానికి స్పందించిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి
- ఎమ్మెల్యే ఆదేశాల మేరకు పాఠశాల భవనాన్ని, శిథిలమైన గదులను పరిశీలించిన స్థానిక నాయకులు
- దసరా సెలవుల్లో కూల్చివేస్తామని సిబ్బందికి ఎమ్మెల్యే హామీ

శిథిలమైన భవనాన్ని పరిశీలిస్తున్న జడ్పీ హైస్కూల్ ఎస్ఎంసీ మాజీ వైర్మన్ ఎల్లారెడ్డి తదితరులు

పెద్దేముల్, సెప్టెంబర్ 24 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల దుస్థితి గురించి మంగళవారం నమస్తే తెలంగాణ దినపత్రికలో 'క్షణక్షణం.. భయం భయం' అనే శీర్షికతో ప్రచురించిన కథనానికి తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి స్పందించారు. ఎమ్మెల్యే స్పందిస్తూ స్థానిక నాయకులు, జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మాజీ ఎస్ఎంసీ చైర్మన్ ఎల్లారెడ్డి, పెండ్యాల ప్రవీణ్‌కుమార్‌గుప్తాలకు ఫోన్ చేశారు. పాఠశాలను సందర్శించి త్వరలో పాఠశాల పాత భవనాన్ని, శిథిలమైన గోడలను కూల్చివేస్తామని పాఠశాల సిబ్బందికి హామీ ఇవ్వాలని మంగళవారం ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు వారు పాఠశాల జీహెచ్ఎం సునీతతో కలిసి పాఠశాల పాత భవన సముదాయాన్ని, శిథిలావస్థకు చేరిన గదులు, శిథిలమైన గోడలను క్షుణ్ణంగా పరిశీలించారు. అక్కడక్కడ కొన్ని గదుల్లో వివిధ రకాల సామగ్రి, కట్టెలు, కంప్యూటర్లు, మధ్యాహ్న భోజనం ఉండడం చూసి వెంటనే తొలగించాలని సూచించారు. దసరా సెలవుల్లో పాఠశాలలో విద్యార్థులు ఉండరు కాబట్టి పూర్తిగా కూల్చివేస్తామని.. పాఠశాల మైదానాన్ని పరిశుభ్రంగా చేస్తామని.. గదుల్లో ఉన్న సామగ్రిని వీలైనంత త్వరగా తొలగించేందుకు తమకు సహాయ సహకారాలందించాలని పాఠశాల జీహెచ్ఎం సునీత, పాఠశాల సిబ్బందిని కోరారు. ఎమ్మెల్యే స్థానిక నాయకులను పాఠశాలకు పంపడంతో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల పాత భవనాన్ని పరిశీలించినవారిలో మండల నాయకుడు గోపాల్, తట్టేపల్లి మాజీ ఎంపీటీసీ శంకర్, ఉపాధ్యాయురాలు సంధ్య ఉన్నారు.

ప్రకృతివనాలు భేష్

- రాష్ట్ర ప్రభుత్వ కమిషనర్, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖల అధికారుల కితాబు
- యాచారం మండలంలో పర్యటన

రైతులతో మాట్లాడుతున్న అధికారులు

యాచారం, సెప్టెంబర్ 24 : గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతివనాలు, బృహత్ పల్లె ప్రకృతివనాలు బేషుగ్గా ఉన్నాయని రాష్ట్ర కమిషన్, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖల అధికారులు శిల్ప, ఆకృతి, విదిష్ట కితాబిచ్చారు. మండలంలోని చౌదర్‌పల్లి, గడ్డమల్లాయగూడ, గున్‌గల్, యాచారం గ్రామాల్లో ఐరా ఎలాజికల్ సొల్యూషన్స్ అధికారులతో కలిసి మంగళవారం పర్యటించారు. ఆయా గ్రామాల్లోని బృహత్ పల్లె ప్రకృతివనం, పల్లె ప్రకృతివనం, అవెన్యూ, హార్టికల్చర్, కమ్యూనిటీ ప్లాంటేషన్‌ను వారు పరిశీలించారు. ప్లాంటేషన్‌కు సంబంధించి పలు అంశాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. మొక్కల పెంపకం, సంరక్షణ చూసి అధికారులను అభినందించారు. రైతుల పొలాల్లో ఉన్న పండ్ల తోటల్లో సీతాఫలాల సాగును చూసి రైతులను మెచ్చుకున్నారు. కార్బన్ క్రెడిట్ కోసం ప్లాంటేషన్ ద్వారా వాతావరణంలో వెలువడిన ఆక్సిజన్‌ను, చెట్ల రకాలు, చెట్ల వయస్సు, చెట్టు యొక్క పరిమాణం ఆధారంగా గ్రహించుటకుగాను పైలెట్ సర్వేను చేపడుతున్నట్లు వారు స్పష్టం చేశారు. సర్వే ద్వారా ప్లాంటేషన్ చేపట్టే యజమానులు కార్బన్ క్రెడిట్ ద్వారా ఆదాయం సముపార్జించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. యాచారం మండల పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా స్థానిక అధికారులతో కలిసి పాయింట్‌లో ఫొటోలు దిగి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో పచ్చదనాన్ని పెంపొందించేందుకు గత ప్రభుత్వం చేపట్టిన పల్లె, బృహత్ ప్రకృతివనాల నిర్వహణ ఎంతో బాగుందన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో రైతుల పొలాల్లో పెంచుతున్న పండ్ల తోటలతో రైతులకు మంచి లాభాలుంటాయన్నారు. మొక్కలను విరివిగా నాటి ప్రతి మొక్కనూ సంరక్షించాలన్నారు. ఆక్సిజన్ వెలువడే మొక్కలను అధికంగా పెంచాలని వారు సూచించారు. కార్యక్రమంలో హార్టికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ శరత్‌బాబు, ఎస్పీఎం నరసింహారావు, ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, ఏపీడీ సక్రియానాయక్, ఏపీవో లింగయ్య, ఈసీ శివశంకర్‌రెడ్డి, ప్లాంటేషన్ సూపర్‌వైజర్స్ ఉన్నారు.

వైద్య పరీక్షలు చేసి మందులను అందజేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి

ప్రతిఒక్కరూ షుగర్, బీపీ పరీక్షలు చేయించుకోవాలి

డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి

షాద్‌నగర్‌టౌన్, సెప్టెంబర్ 24 : గ్రామీణ ప్రాంతాల్లో 30 సంవత్సరాలు పైబడిన ప్రతిఒక్కరూ తప్పకుండా షుగర్, బీపీ పరీక్షలు చేయించుకోవాలని షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి సూచించారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఫరూఖ్‌నగర్ మండలం చింతోడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏరియాలోని సబ్‌సెంటర్ మొగిలిగిద్ద గ్రామంలో మంగళవారం వైద్యారోగ్యశాఖ ఎంఎల్‌హెచ్‌పీ వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రాథమిక దశలోనే షుగర్, బీపీని గుర్తించి సరైన మందులు వాడితే ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ఉచితంగా మందులను పంపిణీ చేస్తున్నదన్నారు. వర్షాకాలంలో వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించాలన్నారు. ముఖ్యంగా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని.. మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసే వైద్య శిబిరాలను గ్రామస్తులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి ఎంపీడీవో జయంత్‌రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్, హెల్త్ సూపర్‌వైజర్ చంద్రకళ, పంచాయతీ కార్యదర్శి బాషిద్, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

బ్యాంకు, స్త్రీనిధి రుణాలు అందేలా చూడాలి

డీఆర్‌డీవో పీడీ శ్రీలత

షాద్‌నగర్‌టౌన్, సెప్టెంబర్ 24 : గ్రామీణ ప్రాంతాలలోని స్వయం సహాయక సంఘాల మహిళలందరికీ ఇందిరా మహిళా శక్తి ప్రోగ్రామ్‌లో భాగంగా బ్యాంకు, స్త్రీనిధి రుణాలు అందేలా చూడాలని డీఆర్‌డీవో పీడీ శ్రీలత ఏపీఎంలు, సీసీలకు సూచించారు. పట్టణంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో మంగళవారం షాద్‌నగర్ తాలుకాలోని ఏపీఎంలు, సిబ్బందికి ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లోని స్వయం సహాయక సంఘాల మహిళలందరికీ ఇందిరా శక్తి ప్రోగ్రామ్ ద్వారా బ్యాంకు, స్త్రీనిధి రుణాలను ఇప్పించి వారు ఆర్థికంగా రాణించేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సంఘాల మహిళలందరూ రుణాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని, తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి కొత్త రుణాలను పొందాలన్నారు. అనంతరం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా కార్యాలయం ఆవరణలో మొక్కలను నాటి ఆమె నీళ్లు పోశారు. కార్యక్రమంలో అడిషనల్ పీడీ సూర్యారావు, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ స్వర్ణలత, అధికారులు, షాద్‌నగర్ ఏపీఎం నగేశ్, వివిధ మండలాల ఏపీఎంలు, మండల సమాఖ్య అధ్యక్షురాలు అనురాధ, సీసీలున్నారు.

మహిళా సమాఖ్య కార్యాలయం ఎదుట మొక్కను నాటి నీళ్లు పోస్తున్న డీఆర్‌డీవో పీడీ శ్రీలత

కాలానికి అనుగుణంగా మారాలి

- వికారాబాద్ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి
- నాటుసారా తయారీ, దాని దుష్ప్రభావాలపై అవగాహన సదస్సు

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

పెద్దేముల్, సెప్టెంబర్ 24 : నాటుసారాను తయారు చేయడం, అమ్మడం, అక్రమ రవాణా చేయడం చట్టరీత్యా నేరమని వికారాబాద్ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని నెల్లిగడ్డతండా గ్రామంలో రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దశరథ ఆదేశాల మేరకు డీపీఈవో విజయభాస్కర్‌గౌడ్ సూచనలతో తాండూరు ఎక్సైజ్ సీఐ బాలగంగాధర్ ఆధ్వర్యంలో నాటుసారాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లా ఎక్సైజ్ అధికారి విజయ భాస్కర్ గౌడ్‌తోపాటు పలువురు అధికారులు, నాయకులు మాట్లాడుతూ.. నాటుసారా తయారీకి సంబంధించిన అనుమానాస్పద వ్యక్తులను, నేర చరిత్రగల ముద్దాయిలను స్థానిక తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేయడం జరుగుతుందన్నారు. దానిని ఉల్లంఘించినవారిపై రూ.2 లక్షల వరకు జరిమానా, ఒక సంవత్సరం జైలు శిక్ష కూడా విధిస్తారన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మనలో కూడా మార్పువచ్చి మనం మారాలని, నేరాలకు పాల్పడితే ప్రభుత్వ పథకాలను నిలుపుదల చేయటకు చర్యలు తీసుకొని పీడీ యాక్టు చట్టాన్ని కూడా ప్రయోగిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా నాటుసారాను తయారు చేయడం, విక్రయించడం, రవాణా చేయడం మానుకోవాలని నెల్లిగడ్డతండావాసులకు మాజీ జడ్పీటీసీ ధారాసింగ్, మాజీ ఎంపీటీసీ లక్ష్మణ్‌నాయక్ సూచించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులతో నాటుసారాను తయారుచేయడం, ఇతరులకు విక్రయించడం, సేవించడం ఇక మీదట చేయబోమని సేవాలాల్ మహారాజ్, భవానీ మాతలపై ప్రమాణం చేసి ప్రతిజ్ఞ చేయించామని ఎక్సైజ్ సీఐ బాలగంగాధర్ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిషన్, డీటీఎఫ్ సీఐ శ్రీనివాస్, ఎక్సైజ్ ఎస్ఐలు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

భూగర్భ కాలువకు మరమ్మతులు చేపట్టాలి

కడ్తాల్, సెప్టెంబర్ 24 : మండల కేంద్రంలోని తలకొండపల్లి చౌరస్తాలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీకి మరమ్మతులు చేపట్టాలని కోరుతూ మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్ వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి విస్తరణలో భాగంగా మండల కేంద్రంలో రెండు కిలోమీటర్ల మేర రోడ్డుకిరువైపులా, వాన నీళ్లు పోయేందుకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీని నిర్మించారని తెలిపారు. కడ్తాల్ మీదుగా తలకొండపల్లి-షాద్‌నగర్‌కు నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు కొనసాగిస్తాయని పేర్కొన్నారు. నాలుగు నెలల క్రితం తలకొండపల్లి చౌరస్తా వద్ద అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ కుంగిపోయి రెండు చోట్ల రంధ్రాలు ఏర్పడ్డాయని తెలిపారు. దీంతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. రాత్రివేళ్లలో గోతులు కనిపించక వాహనదారులు కిందపడ్డ సందర్భాలున్నాయని చెప్పారు. డ్రైనేజీకి మరమ్మతులు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదని ఆయన విచారం వ్యక్తం చేశారు. ఏదైనా పెద్ద ప్రమాదం జరుగకముందే మరమ్మతులు చేపట్టాలని అదనపు కలెక్టర్‌కు విన్నవించినట్లు పేర్కొన్నారు.

జిల్లా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సుధీర్

గ్రామాభివృద్ధిపై ఆరా

పులుమామిడి గ్రామాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్ సుధీర్

నవాబుపేట, సెప్టెంబర్ 24 : మండలం పరిధిలోని పులుమామిడి గ్రామాన్ని వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన తన వెంట ఉన్న ఎంపీడీవో అనురాధతో కలిసి గ్రామంలోని కొన్ని వార్డుల్లో తిరిగారు. గ్రామాభివృద్ధిపై స్థానికంగా ఉన్న నాయకులు, గ్రామస్తులను అడిగారు. జడ్పీ, ప్రైమరీ, అంగన్‌వాడీ పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల వ్యాప్తిపై ప్రజలకు అవగాహన కల్పించాలని.. ఆరోగ్యపరమైన జాగ్రత్తలు తీసుకునేలా చూడాలని మండలాధికారులకు సూచించారు. గ్రామంలో మిషన్ భగీరథ వాటర్ వస్తుందా, తాగునీటి సమస్యలు ఏమైనా ఉంటే వెనువెంటనే పరిష్కరించాలన్నారు. అండర్ డ్రైనేజీ, వార్డుల పరిశుభ్రత వంటి వాటిపై నిర్లక్ష్యం ఏమాత్రం చేయరాదని, చేస్తే సంబంధిత అధికారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా పరిషత్, అంగన్‌వాడీల్లో విద్యార్థుల చదువు, మధ్యాహ్న భోజనంపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో తరగతి గదులు, మరుగుదొడ్ల సౌకర్యం, నీటి సమస్యలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అనురాధ, పాఠశాల హెచ్ఎం, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్తుడు భీమ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నేత వెంకటయ్య, పంచాయతీ సెక్రటరీ బందయ్య, పారిశుధ్య కార్మికులు ఉన్నారు.



మంచాల మండల అధికారులతో ఐవోఆర్ఏ సంస్థ సభ్యులు

మొక్కల పరిశీలన

మంచాల, సెప్టెంబర్ 24 : మంచాల మండలం జాపాల, మంచాల గ్రామాల్లో ఐవోఆర్ఏ పర్యావరణ పరిరక్షణ సంస్థకు చెందిన బృందం సభ్యులు మంగళవారం సాయంత్రం మంచాల ఎంపీడీవో బాలశంకర్‌తో కలిసి పర్యటించారు. ముందుగా జాపాల గ్రామంలోని బృహత్ పల్లె ప్రకృతివనంలో పెంచుతున్న మొక్కలను పరిశీలించారు. అనంతరం మంచాల పోలీస్టేషన్‌లో ఉపాధి హామీ పథకం ద్వారా నాటిన మొక్కలు నేడు చెట్లుగా పెరగడాన్ని వారు పరిశీలించి.. అనంతరం వాటి సంరక్షణ బాధ్యతలను అధికారులను అడ